

మరమ్మతుకు నోచని తాగునీటి బోరు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని పోతంగి సచివాలయ కార్యాలయానికి ఎదురుగా ఉన్న తాగునీటి బోరు మరమ్మతుకు గురై సుమారు నెల రోజుల నుంచి నిరుపయోగంగా ఉంది. స్థానిక గిరిజనులతో పాటు వివిధ పనుల నిమిత్తం యూనియన్ బ్యాంక్, పోతంగి సచివాలయానికి వచ్చిన గిరిజనుల దాహార్తి తీర్చు కోవడానికి ఈ బోరు ఎంతో ఉపయోగపడుతుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చిన గిరిజనులు తాగునీటి కోసం పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కారణంగా సచివాలయం వీధిలో ఉన్నవారికి తాగునీటి సమస్య ఏర్పడుతుంది. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరు మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న బోరు

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



పాడేరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-పాడేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంటు, అసెంబ్లీకి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మిక వర్గానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం పాడేరులో నిర్వహించిన అల్లూరి జిల్లా సిఐటియు విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు చట్టాలను ప్రధాని మోడీ కాలరాస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ స్వలాభం కోసం మోడీ పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతను దెబ్బ కొట్టాలని చూస్తుందన్నారు.వివిధ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు అతి తక్కువ వేతనాలతో శ్రమను దోచుకుంటుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని, వారి మద్దతుదారులను చిత్తుగా ఓడించాలని కోరారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన మూడు పార్టీలు కేంద్రంలో బిజెపితో జట్టు కడుతూ రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకపోయినా, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకి అన్యాయం చేసినా అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపికి కొమ్ముకాస్తున్నాయన్నారు. జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని,గిరిజన ప్రాంతంలో స్పెషల్ డిఎస్సిని విడుదల చేసి, అటవీ చట్టాల్ని పట్టిష్టంగా అమలు చేయాలన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు శంకర్రావు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.అప్పల నరస, అనంతగిరి జడ్పిటిసి సభ్యులు డి. గంగరాజు, సిఐటియు ఆఫీస్ బేరర్స్, సన్నీ బాబు, భగత్ రాం, శంకర్రావు, నాయుడు, పోతురాజు, సుందర్ రావు, వివిధ రంగాల కార్మికులు, నాయకులు పాల్గొన్నారు



అనంతగిరిలో మాట్లాడుతున్న గంగరాజు

గంగరాజు విస్తృత ప్రచారం

అనంతగిరి:సార్వత్రిక ఎన్నికలలో సిపిఎం బలపరిచిన అభ్యర్థులకే ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని స్థాని సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు కోరారు. ఆదివారం ఎగువ శోభ పంచాయతీ పరిధి దిగువశోభ, పూర్ణపుదోర్, ఎగువ శోభ, సరసుపదర్. టోకూరు పంచాయతీ బ్రిడ్జి వలస తదితర గ్రామాల్లో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, తాగునీరు, .డ్రెయినేజీ, సిసి రోడ్డు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేసే నాయకులను గెలిపిస్తే అసెంబ్లీ, పార్లమెంట్లో ప్రజల గళం విప్పుతారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ నేత శాంతారావు, వార్డు మెంబర్ పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కూటమిలో పొత్తుల కుంపటి

▶▶ అభ్యర్థుల ఎంపికలో మల్లగుల్లాలు ▶▶ సీట్ల కేటాయింపులపై తర్జనభర్జనలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో అరకు, పాడేరు ఎంపీ, అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను పోటీకి వైసిపి సిద్ధ మైతే... టిడిపి, బిజెపి, జనసేన కూటమి పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికలో ఇంకా సందిగ్ధంతోనే ఉన్నాయి. పొత్తులో భాగంగా ఈ సీట్ల కేటాయింపు అభ్యర్థుల ఎంపిక పై కూటమి నేతలు తర్జనభర్జనలలో తల మునకలయ్యారు.

అరకు అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థిగా దొన్నుదొర పేరును తొలి జాబితాలోనే తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. అయితే ఈ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు స్థానిక బిజెపి నాయకుడు పాంగి రాజారావు ముందు నుంచి తన ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. రాష్ట్ర, కేంద్ర నాయకులతో రాజారావుకు సత్సంబంధాలు ఉన్నాయి. అయితే అరుకు అసెంబ్లీ సీటును అనూహ్యంగా పొత్తులో భాగంగా కూటమిలోని టిడిపికి ప్రకటించారు. అయినప్పటికీ రాజారావు తన ప్రయత్నాల్ని విరమించలేదు.

ఇదే క్రమంలో పాడేరు అసెంబ్లీ స్థానాన్ని బిజెపికి కేటాయించాలని కూటమి పార్టీలు నిర్ణయించాయి. ఈ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు స్థానిక బిజెపి నేతల్లో ఆసక్తి లేకపోవడం, వైసీపీకి బలమైన ప్రత్యర్థిగా బరిలో నిలిచే నేతలు బిజెపిలో కొరత ఉండటంతో పాడేరు అభ్యర్థి ఎంపికలో కూటమికి సందిగ్ధావస్థ ఎదురయింది. ఈ క్రమంలో టిడిపి నుంచి ఒకరిని బిజెపి తరపున పోటీ చేయించాలని కూడా కూటమి నేతలు సమాలోచన చేస్తున్నారు.

కూటమి తరపున అరకు పార్లమెంట్ స్థానం నుంచి అభ్యర్థిగా కొత్తపల్లి గీత ఎంపిక ఇప్పటికే ఖరారు అయ్యింది. ఈ మేరకు అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల నుంచి బిజెపి అభ్యర్థుల్ని నిలిపే ఆలోచనతో పాటు తిరిగి పాడేరు అసెంబ్లీ స్థానం నుంచి టిడిపి అభ్యర్థిని బరిలో నిలపాలని కూటమి భావిస్తున్నట్లు తాజా సమాచారం తెలుస్తోంది. మరోవైపు అరకులో తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే సివేరి సోమ తనయుడు అబ్రహం ప్రచారం మొదలుపెట్టారు. దీనిపై టిడిపి అధిష్టానం బుజ్జగింపులు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అబ్రహం తనకు అరకు టిడిపి టిక్కెట్ దక్కలేదని మొదటి నుంచి అధిష్టానం పట్ల తీవ్ర నిరసనతోనే ఉన్నారు. ఆయన బరిలో ఉంటే టిడిపి అభ్యర్థి దొన్నుదొర విజయావకాశాలకు గండి పడుతుంది. కూటమిలో బిజెపికి అరకు అసెంబ్లీ స్థానం ఇస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని, అలాగే పాడేరులో బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నుంచి అభ్యర్థిని నిలిపితే వైసీపీకి గట్టి పోటీ ఉంటుందని కూటమి నేతలు సమాలోచన చేస్తున్నట్లు సమాచారం.అరకు పాడేరు స్థానాల్లో కూటమి అభ్యర్థుల మార్పులు, చేర్పులతో కొలిక్కి వచ్చే పరిస్థితి ఎప్పుడు వస్తుందో వేచిచూడాలి.

తాగునీటి ఎద్దడిని నివారించండి

● వైస్ ఎంపిపి పెంటయ్య



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి పెంటయ్య

ప్రజాశక్తి- కూనవరం : మండల కేంద్రమైన కూనవరం ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి దాహార్తిని తీర్చాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కొన్నిరోజులుగా మండల కేంద్రవాసులు దాహార్తితో అల్లాడిపోతున్నారని, దీనిపై పూర్వ కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తానని హామీనిచ్చారని, ఇంతలోనే బదిలీ అయి వెళ్లిపోయారన్నారు. తర్వాత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వేసవి తొలిరోజుల్లోనే మండల కేంద్రంలోనే తాగునీటి ఎద్దడిపై రోజుల తరబడి అధికారులు పట్టించుకోకపోతే ముమ్మందు పరిస్థితి ఏంటని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. శబరి, గోదావరి నదులు చెంతనే నీటి ఎద్దడి నెలకొనడం సరికాదన్నారు. దీంతో మండల కేంద్రంతోపాటు టేకులబోరు వాసులు మోటారు బైక్‌లపై బిందెలతోనూ, ట్రాక్టర్లపై ట్యాంకర్లతో నీటిని తెచ్చి అవసరాలను తీర్చుకుంటున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లకు తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు వేరే చెప్పనక్కరలేదన్నారు. ఎన్నికలను సాకుగా చూపి, నిధులు లేవంటూ అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని, వేసవిలో తాగునీటి ఎద్దడి అనేది తీవ్రమైన సమస్యగా పరిగణించి, ప్రనత్యేక నిధులు మంజూరు చేయించి, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. మండలకేంద్రంతోపాటు మండల వ్యాప్తంగా అనేక గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై అధికారయంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని పెంటయ్య డిమాండ్ చేశారు.సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, ఎంపిటిసి జయసుధ, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, శంకర్ తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, పాయం సత్యనారాయణ, బాబు బొర్రయ్య పాల్గొన్నారు.

నిర్వాసితులకిచ్చిన హామీలను నెరవేర్చాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత సత్యనారాయణ

ప్రజాశక్తి -విఆర్ పురం: 41.15కాంటూరులో కొన్ని గ్రామాలలో ఇంకా పెండింగ్‌లో ఉన్న అర్అండ్అర్ ఇవ్వలేదని, తక్షణం వారికి పరిహారం, ప్యాకేజీ చెల్లించాలని సిపిఎం విఆర్ పురం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం మండలంలో శ్రీరామగిరిలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనేం సత్యనారాయణ మాట్లాడుతూ, పోలవరం నిర్వాసితుల కిచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో భూపరిహారం రూ.1.15 లక్షలు ఇవ్వగా, వైసిపి అధికారంలోకి వస్తే రూ.ఐదులక్షలు ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. అర్అండ్ఆర్ రూ.6.36 లక్షల ఇచ్చిన వారికి మిగతా పరిహారం హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోవడంలో రాష్ట్రప్రభుత్వం విఫలం చెందిందన్నారు. తక్షణమే నిర్వాసితుల కిచ్చిన హామీలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పులి సంతోష్‌కుమార్, గుండెపూడి లక్ష్మణరావు, పంకు సత్తిబాబు, తాతబాబురెడ్డి, కమ్మచిచ్చు సత్యనారాయణ, కాంతారావు, పులి ధర్మరాజు, ఎన్ చంద్రరావు, పులి చంద్రారావు, టి నాగేశ్వరరావు, ధారోగు బాబూరావు, సోడి మల్లయ్య పాల్గొన్నారు



జల దీక్ష నిర్వహిస్తున్న గిరిజనులు

రోడ్డు పనులు పున:ప్రారంభించాలని
గిరిజనులు జల దీక్ష

ప్రజాశక్తి -అనంతగిరి:తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, నిలిచిన రోడ్డు పనులు వెంటనే పున: ప్రారంభించాలని గిరిజనులు వినూత్న రీతిలో జల దీక్ష చేపట్టారు. మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధి కరీగొడా, కడరేవు గ్రామాలకు చెందిన గిరిజనులు ఆదివారం వినూత్న రీతిలో డోలీ సహాయంతో జల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, గుమ్మ పంచాయతీ నిమ్మ ఊట గ్రామం, కర్రి గోడ, కడరేవు, పిన్నకోట పంచాయతీ పరిధి కొట్టంగుడా, గొప్పులపాలెంలో సుమారు 160 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామన్నారు. 2021 ,22 సంవత్సరంలో రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం కోటీ 20 లక్షల నిదుల మంజూరు చేయగా అధికారులు రోడ్డు పనులు మొదలుపెట్టి కిలోమీటర్ వరకూ చేపట్టి అసంపూర్తిగా వదిలివేసారని విమర్శించారు. గిరిజనులు రోగాల బారిన పడినప్పుడు వైద్యం కోసం ఆసుపత్రులకు డోలీల్లో తరలిస్తున్నారని సకాలంలో వైద్య సేవలు అందక గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు మృత్యువాతకు గురవుతున్నారని తెలిపారు.తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే డోలీ మోతలతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాప రాజారావు, నందోలి రాజారావు, ఉల్లి సింహాచలం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి : సిపిఎం

ప్రజాశక్తి -అనంతగిరి:రెండు మండలాల సరిహద్దు పివిటిసి పట్కదౌడ గ్రామంలో ఉపాధ్యాయుడుని తక్షణమే నియమించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్,నాగులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ గ్రామంలో సందర్శించిన ఆయన పివిటిజి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు మాట్లాడుతూ, తమ గ్రామంలో ఉపాధ్యాయుడు అకాల మరణంతో సుమారు ఆరు నెలలకు పైగానే పాఠశాల మూత పడిందని తెలిపారు. దీంతో విద్యార్థుల చదువులు సాగలేదన్నారు.ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, పట్క దౌవడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఆరు నెలల నుంచి ఉపాధ్యాయుడిని నియమించక పోవడంతో విద్యార్థులకు విద్య అందలేన్నారు.విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుడిని నియమించి విద్యాబోధన అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత

సిపిఎంతోనే నియోజకవర్గ అభివృద్ధి

● పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి - ఎటపాక : రంపచోడవరం నియోజవర్గంలో అభివృద్ధి జరగాలంటే సిపిఎంతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరావుపేట, తెలపండి రేవు లక్ష్మీపురం, బురుగువాయి, రాంగోపాలపురం వీరాయగూడెం, కొండపల్లి, గొల్లగట్ట, కెఎన్.పురం గ్రామాల్లో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశాలు జరిగాయి.

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ, నాలుగు మండలాల్లోని పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన వైసిపి, టిడిపికి లేదన్నారు. నిర్వాసితుల సమస్యలపై ఆది నుంచి సిపిఎం పోరాడుతూనే ఉందని, అయితే చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోవడంతో అవి సాకారం కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో నిర్వాసితులకు న్యాయం జరగాలంటే వారి సమస్యలపై ప్రశ్నించి సిపిఎం ప్రతినిధి చట్టసభల్లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ, డబ్బులతోనే గెలిచిన టిడిపి, వైసిపిలు ప్రజల కోసం పనిచేసిన పాపాన పోలేదన్నారు. రంప చోడవరం ఏడు మండలాల్లో జరగని అభివృద్ధి ముంపు మండలాల్లోనే జరిగిందని, దానికి కారణమేంటో గుర్తించాలన్నారు. సిపిఎం ఎమ్మెల్యేలు ముర్ల ఎర్రరెడ్డి, కుంజా బొజ్జి, సున్నం రాజయ్యల కృషితోనే చింతూరులో ఆశ్రమ పాఠశాలలు భద్రాచలంలో బస్‌స్టాండ్‌లు, ఆసుపత్రులు, విద్యాలయాలు, ఎత్తిపోతల పథకాలు, తాగునీటి సౌకర్యం వంటివి అభివృద్ధి చెందాయన్నారు. వాటిని రంపచోడవరం నియోజకవర్గంతో పోల్చిచూస్తే, సిపిఎం, ఇతర పార్టీల ప్రజాప్రతినిధుల పనితీరు, కృషి స్పష్టమౌతుందన్నారు. గడచిన పదేళ్లలో రంపచోడవరంలో ఇసుమంతైనా అభివృద్ధి జరగలేదని, ఇక్కడ సిపిఎం ప్రతినిధి గెలిస్తేనే, అభివృద్ధిబాట పట్టే అవకాశం ఉందన్నారు. రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల వైసిపి, టిడిపి ప్రజాప్రతినిధులను చూసి, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆలోచించి సిపిఎంకు అవకాశమివ్వాలని కోరారు.

మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎం ప్రజాప్రతినిధులు మాత్రమే ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి, చొరవ చూపి పోరాడతారన్నారు. జిఒ3 రద్దు, బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానంపై సిపిఎం మాత్రమే పోరాటం చేసిందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఇర్పా అజయ్, కాకా అర్జున్, సోయం వీరమ్మ, సోందే రామారావు, ఇరపా సత్యం, సవలం రాము, పూనెం వెంకట్రావు, నక్క సూరిబాబు, పర్షిక ధర్మరాజు, కందుల సతీష్, పి.సరవయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లోతా రామారావు, చిత్రంలో కిరణ్ తదితరులు

విద్యుత్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు

ప్రజాశక్తి -సీలేరు: కార్మికుల సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని, వాటి పరిష్కారానికి పోరాటమే శరణ్యమని ఎపి విద్యుత్ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు వెల్లడించారు. ఆదివారం సీలేరులోని ఎపి జెన్‌కో కల్యాణ మండపంలో తెలుగు నాడు విద్యుత్ కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ రంగ కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చినా కనీస స్పందన లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల విద్యుత్ రంగం నిర్వీర్యమైపోయిందని వాపోయారు. రాబోయే రోజుల్లో విద్యుత్ రంగానికి మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగుణాకర్ రావు మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల అలవెన్స్‌లు, వేతన సవరణపై ప్రభుత్వం మొండివైఖరిని వీడి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా కార్మికులకు ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సంస్థల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మధుసూధనరెడ్డి, అదనపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామమూర్తి రాష్ట్ర కోశాధికారి కే. వెంకటేశ్వర రావు, సీలేరు టిఎన్‌టియుసి ప్రాంతీయ నాయకులు భాస్కరరావు, వరప్రసాద్, అప్పారావు త్రినాధ్, రఘురాం, పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఎపి జెన్‌కో నాయకులు పాల్గొన్నారు.



సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు సాంబశివరావు

ఆరు నాటు తుపాకుల అప్పగింత



నాటు తుపాకులను చూపిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఓకుర్తి, వంచంగి గ్రామాలకు చెందిన వ్యక్తులు ఆరు నాటు తుపాకులను ఆదివారం స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించారు. దీనికి సంబంధించి రాజవొమ్మంగి సిఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపిన వివరాలివి. అల్లూరిజిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ ఆడహళ్లి ఆదేశాల మేరకు రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలో రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో అనుమతుల్లేకుండా నాటుతుపాకులను కలిగి ఉన్నవారు స్వచ్ఛందం అప్పగించాలన్న పిలుపుతో ఆదివారం జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓకుర్తి గ్రామంలో నాలుగు నాటు తుపాకులు, వంచంగి గ్రామం నుంచి రెండు నాటుతుపాకులను స్థానికులు స్వచ్ఛందంగా పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఇప్పటివరకు మండలంలో 14నాటు తుపాకులను స్వచ్ఛందంగా అప్పగించారన్నారు. ఇంకా గిరిజన గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేని నాటుతుపాకులు, తపంచాలను కలిగి ఉంటే వెంటనే పోలీసులకు అప్పగించాలని కోరారు. గడువు దాటిన తర్వాత పోలీసు తనిఖీల్లో పట్టుబడితే ఆయుధాల నియంత్రణ చట్టం కింద కేసు, శిక్ష ఉంటుందని హెచ్చరించారు.కార్యక్రమంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది ఉన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా రంపచోడవరం ఎస్ఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వాహన రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు విధిగా తమ వెంట వాహనానికి సంబంధించిన పత్రాలను ఉంచుకోవాలన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడపరాదని సూచించారు.తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వుల సాగు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షానికి నువ్వు సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాజుపేట, సుంకపూర, చౌడువాడ, లింగాపురం, ఎండపల్లి, కోటవురట్ల సహా పలు గ్రామాలలో ఖరీఫ్ వరి అనంతరం రబీలో నువ్వుల పంట సాగు చేస్తున్నారు. నువ్వు పంట సుమారు 200 హెక్టర్లు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత కాపు దశలో ఉంది. ఇటీవల వర్షం కురవడంతో ప్రధానంగా మెట్ట ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవకుంటే సాగునీటికి అదనపు ఖర్చు అయ్యేదని రైతులు అంటున్నారు.

ఘనంగా అనిత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నక్కపల్లి: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అనిత ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు కృష్ణమాచార్యులు ఆమె పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆమెకు వెంకన్న చిత్రపటాన్ని బహూకరించారు .నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్‌లో జరిగిన అనిత జన్మదిన వేడుకల్లో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు హాజరై అనితను గజమాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనిత కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, చిట్టిబాబు, అబద్ధం, శ్రీను, కురందాసు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో దేవి ప్రతిభ

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: ఈనెల 18 నుండి 22 వరకు న్యూఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 87కేజీల కేటగిరీ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సబ్బవరం మండలం చెట్టుపల్లి జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ గుడివాడ దేవి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా నిజాంస్ ఆకాడమీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, సుతాపల్లి బ్రదర్స్ శ్రావణ్, శ్రీకాంత్, ఉమెన్ డైరెక్టర్స్ సెక్రటరీ సుమ, పివిఎస్.నాగజ్యోతి అభినందించారు. ఈ సందర్భంగా నాల్ కోచ్ అబ్బు మాట్లాడుతూ, ఆమె వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్‌లో సీనియర్ నేషనల్ ఆల్ ఇండియా యూనివర్సిటీలో కూడా అనేక పతకాలు సాధించారని, ఎంతో మంది విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

ఇంటర్ స్టేట్ ఉమెన్ అండర్-19 రన్నర్స్‌కు రూ. 20 లక్షల పారితోషికం

ప్రజాశక్తి -పిఎం పాలెం : దేశంలోనే మొట్ట మొదటిసారిగా ఉమెన్స్ టీ-20 లీగ్ నిర్వహించడంతో దేశ వ్యాప్తంగా ఆంధ్రకు మంచి గుర్తింపు వచ్చిందని ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీసీఐ ఇంటర్ స్టేట్ అండర్-19 ఉమెన్ టీ-20 ఛాంపియన్‌షిప్‌లో రన్నర్సప్‌గా నిలిచిన ఏసీఏ జట్టు సభ్యులకు ఆదివారం పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరఫున ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి వారిని రూ.20 లక్షల పారితోషికంతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి నాయకత్వంలో క్రికెట్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. జోనల్ లెవెల్ దాటిన యువ క్రీడాకారుల పోషకాహారం కోసం ఏప్రిల్ నుంచి నెలకు రూ. 3 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకుగాను ఏడాదికి రూ.1.50 కోట్లు ఖర్చు అవుతుందని వివరించారు. ఈ ఏడాది నుంచి ఏపీఎల్‌తో పాటు ఉమెన్ ప్రీమియర్ లీగ్‌ను కూడా నిర్వహించేందుకు అనుమతి కావాలని బీసీసీఐ కార్యదర్శి జైషాను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆంధ్ర నుంచి అంతర్జాతీయ క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించామన్నారు. జాతీయ జట్టులో చోటు సంపాదించేలా ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లకు దేశంలో ఉత్తమ కోచింగ్‌తో పాటు ఇతర దేశాల్లో వరల్డ్ క్లాస్ శిక్షణ ఇప్పించాలని నిర్ణయించామని తెలిపారు. అనంతరం బిసిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వి.చాముండేశ్వరనాథ్ టీమ్ సభ్యులకు ఎలక్ట్రానిక్ బైక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్.గీత, ఏసీఏ సీఈవో డాక్టర్ ఎం.వి.శివారెడ్డి, సీఎఫ్‌ఓ ఎం.నవీన్‌కుమార్, జనరల్ మేనేజర్లు ఎంఎస్.కుమార్, ఎస్ఎంఎన్.రోహిత్ వర్మ, వీడీసీఏ జనరల్ సెక్రటరీ కె.పార్థసారథి పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం పండగ

ప్రజాశక్తి- యంత్రాంగం

దుంబ్రిగుడ: మండలంలోని వివిధ క్రైస్తవ చర్చిల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సీఎస్ఐ, యూసీబీఎం, బేతేలు చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ చేపడుతూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, పాస్టర్లు, చిన్నారులు, పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక పరిశుద్ధ థామస్ ప్రార్థన మందిరంలో ఆదివారం సంఘ కాపరి కె.జేమ్స్ ఆధ్వర్యంలో మట్టల పండగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ చేపడుతూ ఏసుక్రీస్తు సందేశాన్ని ప్రజలకు చాటి చెప్పారు. అనంతరం స్థానిక సంఘ కాపరి మాట్లాడుతూ, ఏసుక్రీస్తు ప్రభు చూపించిన మంచి మార్గంలో అందరు నడవాలన్నారు. చెడు వ్యసనాల నుండి దూరంగా ఉండి ఏసుక్రీస్తు చూపించిన శాంతి మార్గంలో నడవాలన్నారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవువు బుజ్జిబాబు, ప్రసాద్, లూకా, హనోకు, తిమోతి ఆనంద్, కొర్నేలి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

సీలేరు: సీలేరులో యుసిఐఎం చర్చి ఫాస్టర్ మెస్సయ్య ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టల ఆదివారం పండగను వైభవంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన ఈత మట్టలను చేత పట్టుకొని ఆనందోత్సవాలతో క్రైస్తవులు పండగను జరుపుకున్నారు. చిన్నారులు ఏసుక్రీస్తు, వివిధ వేషధారణలతో సందడి చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వచ్చే శుక్రవారం గుడ్‌ఫ్రైడే, తర్వాత ఈస్టర్ సండే పండుగలను నిర్వహిస్తామని ఫాస్టర్ వెల్లడించారు.


దుంబ్రిగుడలో బోధన చేస్తున్న పాస్టర్

జాతీయ రెజ్లింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి- అరకు లోయ :జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు అరకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని పి..నిర్మల ఎంపిక అయినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో చిత్తూరు డిఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని పి.నిర్మల బంగారు పతాకాన్ని కైవశం చేసుకుందని తెలిపారు. ఈనెల 28న ఉత్తర ప్రదేశ్ లోని నోయిడలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. బంగారు పతాకాన్ని గెలుచుకున్న నిర్మల జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి మహిళా డిగ్రీ కళాశాలకు, అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. నిర్మలను మహిళ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు, అధ్యాపకులు రోజా రాణి, లాలి కుమారి, ప్రణీత, ధర్మారావు, దివ్య మౌనిక, కామేశ్వరరావు, కళాశాల పిడి అప్పారావు, గోపాలకృష్ణ, వేణు అభినందించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

తహశీల్దారు వెంకటరమణ

ప్రజాశక్తి -కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని తహసిల్దార్ వెంకటరమణ సూచించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఇప్పటికే రేషన్ బండ్లు, విగ్రహాలు, సిమెంట్ బెంచీలపై కూడా పార్టీ జెండా సూచికలు, రాజకీయ నాయకుల చిత్రపటాలు బహిరంగంగా కనిపించకుండా చర్యలు తీసుకుం టున్నామన్నారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సర్వేలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాలలో సర్వే రాళ్ల ప్లాంటేషన్ పై ఉన్న వైయస్సార్, జగనన్న భూ రక్ష పేర్లు కనిపించకుండా రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 11 గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా దాదాపు ఆయా గ్రామాల్లో సర్వే రాళ్ల ప్లాంటేషన్ పూర్తయిందన్నారు. ఇందు నిమిత్తం 12800 రాళ్లు సిద్ధం చేయగా వాటిపై ఎటువంటి రాజకీయ నాయకుల పటాలు, పేర్లు, ముద్రలు లేకుండా రంగులు పూసేందుకు అధికారులకు సూచించామని తెలిపారు. ఇప్పటికే చాలా గ్రామాలలో ప్లాంటేషన్ రాళ్లపై ఫోటోలు, నాయకుల పేర్లు కనిపించకుండా రంగులు పూసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నియమాలను పాటించాలన్నారు. శాంతియుతంగా పోలింగ్ జరిగేలా సహకరిం చాలన్నారు. ఇప్పటికే స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల సదుపాయంపై చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన అన్నారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : జాతీయ రహదారిపై నాయక్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఉదయం ఓ యువకుడు మృతి చెందినట్లు పిఎం.పాలెం పోలీసుస్టేషన్ సిఐ వై.రామకృష్ణ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధి సాయి ప్రియ గార్డెన్స్‌కు చెందిన కె.జశ్వంత్ (22) నగరంలోని ఒక జిమ్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారి సాయి ప్రియ గార్డెన్స్ నుంచి ఇంటికి వస్తూ దిశా పోలీస్ స్టేషన్ లా కాలేజ్ మార్గ మధ్యలో ఓ ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జస్వంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రోలుగుంట మండలం శరభవరం గ్రామానికి చెందిన యువకుడు బొబ్బిలి ప్రసాద్ (24) మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ చెప్పిన వివరాల ప్రకారం...కె. కోటపాడులో సార్వత్రిక ఇంటర్ పరీక్షలు రాసేందుకు శనివారం శరభవరం నుంచి బైక్‌పై కోటపాడు వెళ్తున్న ప్రసాద్, చౌడువాడ సమీపంలో ఆర్‌టిసి బస్సును తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాలను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కాగా, కుడికాలు విరిగింది. స్థానికులు 108 వాహనంలో కె.కోటపాడు ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం ఆరోగ్య విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. అచ్యుతాపురంలోని ఇషాన్ చిన్నపిల్లల ఆసుపత్రిలో ప్రసాద్ పనిచేస్తున్నాడని అతని తల్లిదండ్రులు తెలిపారు.

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలం పాతకృష్ణదేవిపేట శివారు బంగారంపేట రహదారిలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గొంప శ్రీను, లోవరాజుకు చెందిన రెండు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. దీంతో రూ.70వేల ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు.

26 నుంచి సుదర్శన నరసింహ మహాయజ్ఞం

ప్రజాశక్తి-సింహాచలం : సింహగిరిపై వరాహలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో తొలిసారిగా ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న చతుర్వేద హవన పూర్వక పంచాహానక పంచ కుండాత్మక (నరసింహ మహాయజ్ఞం)ను విజయవంతం చేయాలని ఈవో సింగాల శ్రీనివాసమూర్తి, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాస్ ఆచార్యులు, స్థానాచార్యులు డాక్టర్ టిపి రాజగోపాల్ పిలుపునిచ్చారు. నరసింహ మహాయజ్ఞం ఏర్పాట్లపై ఆదివారం వైదిక వర్గాలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మహా యజ్ఞానికి దక్షిణ భారతదేశంలో ప్రముఖ క్షేత్రాల నుంచి పండితులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మంగళవారం సాయంత్రం యజ్ఞానికి అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం ఆగమొక్తముగా యజ్ఞానికి అంకురార్పణ ప్రారంభమవుతుందన్నారు. ఏరోజుకారోజు లఘు పూర్ణాహుతి ఉంటుందని, మొత్తం ఏడు కుండలాలల హోమాలు జరుగుతాయని వెల్లడించారు. ఐదు రోజులు ఐదు వాహనాలతో సాయంత్రం వేళలో స్వామివారి తిరువీధోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. యజ్ఞంలో పాల్గొనే భక్తులకు కావలసిన సౌకర్యాలను అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా టికెట్లు విక్రయాలు చేపట్టామని, ఉదయం వచ్చే భక్తులకు అల్పాహారం ఏర్పాటుచేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు ఆనంద్‌కుమార్, నరసింహారాజువర్మ, పాలూరి నర్సింగరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల కేంద్రంలోని విద్యా వికాస్ స్కూల్ వద్ద విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కరస్పాండెంట్ పాప సాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు. మీరిలో 30 మందిని కంటి ఆపరేషన్‌కు విశాఖకు తీసుకు వెళ తున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ సురేష్, శంకర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ అశ్విని కుమార్ తెలిపారు.


జోరుగా సాగుతున్న మునగకాడల అమ్మకాలు

మునగకాడలకు గిరాకీ

- చిరు టమోటాల కొనుగోలుకు జనం ఆసక్తి
- సీలేరు సంతలో హాట్‌కేకుల్లా అమ్మకాలు
- కొనేందుకు ఆసక్తి చూపిన గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు: జికె.వీధి మండలం సీలేరులో ఆదివారం సంతకు మునగకాడలు ముంచెత్తాయి. మండలంలోని దుప్పిలివాడ పంచాయతీ పిల్లిగడ్డ, కాట్రగెడ్డ, వలసగెడ్డ, వలసపల్లి మునసపల్లి తదితర గ్రామాల్లో ఈ ఏడాది మునగ పంట ఆశాజనకంగా ఉండడం, పెద్దఎత్తున దిగుబడి రావడంతో వాటిని విక్రయించేందుకు గిరిజన రైతులు సంతకు తీసుకొచ్చారు. ఆరేడు పెద్దకాడలను ఒక కట్టగా కట్టి రూ.పదికే ఒక కట్ట విక్రయిస్తుండడంతో వీటిని కొనేందుకు గిరిజనులు, వారపుసంతకు వచ్చేవారు ఆసక్తి చూపడంతో మంచిగిరాకీ ఏర్పడి హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. గతేడాది తుపాన్ దెబ్బకు మునగ పంట నష్టపోయినప్పటికీ, ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో జనకంగా మంచి దిగుబడులే వచ్చాయి. అయితే ఇక్కడ ధర తక్కువగా ఉండడంతో ఆశించిన ఆదాయం సమకూరనప్పటికీ, గిరిజన రైతులు కొంత సంతోషంగానే ఉన్నారనే చెప్పాలి. అదే మైదాన ప్రాంతానికి తీసుకెళ్లి విక్రయిస్తే మంచి లాభాలు వచ్చేవని పలువురు అంటున్నారు.

మరోవైపు సీలేరు వారపుసంతలో విక్రయానికి చిరు టమోటాలను గిరిజనులు భారీగానే తెచ్చారు. దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలోని పలు గిరిజనగ్రామాల్లో పండించిన టమోటా పంట కూడా ఆశాజనకంగానే ఉంది. వారపుసంతకు టమోటాలను తెచ్చిన గిరిజన రైతులు వాటిని వాటాలుగా వేసి, ఒక్కో వాటాను రూ.20లకు విక్రయించారు. కిలో కంటే ఎక్కువే ఉన్న టమోటాల వాటా తక్కువ రేటుకే విక్రయిస్తుండడంతో వాటి అమ్మకాలు కూడా జోరుగానే సాగాయని చెప్పాలి. ఈఏడాది అకాల వర్షాలు, తుఫానుల కారణంగా పంటలు కొంతమేర నష్టం జరిగినప్పటికీ, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, అయితే మంచి ధర పలికితే లాభాలు వచ్చేవని గిరిజన రైతులు అభిప్రాయపడుతున్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి నుంచి ప్రారంభమై, పురవీధుల్లోర్యాలీ నిర్వహించారు.మార్కెట్ సెంటర్‌కు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు, అది ఎలా సంక్రమిస్తుంది, వ్యాధి నిర్ధారణ, ప్రభుత్వపరంగా అందించి ఉచిత మందులు, చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి జ్యోతిబాబు హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు కెవిఎన్. కుమారి, దేవి, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

తుంటి ఆపరేషన్ విజయవంతం

ప్రజాశక్తి -రంపచోడవరం : స్థానిక ఏరియా హాస్పిటల్‌లో కాలు తుంటికి చేసిన శస్త్రచికత్స విజయవంతమైందని ఆర్థోపెడిక్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. అడ్డతీగల మండలం భీమవరం గ్రామానికి చెందిన పండురెడ్డి అనే వ్యక్తి తాటిచెట్టుపై నుండి పడడంతో కాలు తుంటి భాగం విరిగింది. ఆదివారం రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌లో ఆర్థోపెడిక్ డాక్టర్ సుధాకర్ తుంటికి శాస్త్ర చికిత్స చేశారు. అది విజయవంతమైందని డాక్టర్ సుధాకర్ తెలిపారు.

అనకాపల్లికి సిఎం రమేష్, అరకుకు గీత

ఎంపీ స్థానాలకు బిజెపి అభ్యర్థులు ఖరారు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

తర్జనభర్జనల తరువాత అనకాపల్లి, అరకు ఎంపీ సీట్లకు కూటమి నుంచి అభ్యర్థులను ప్రకటించారు. స్థానికేతరుడైన సిఎం రమేష్‌ను అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బిజెపి బరిలో పెట్టింది. కడపకు చెందిన ఆయన పెద్ద వ్యాపారవేత్త, టిడిపి అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి, అరకు ఎంపీ అభ్యర్థులుగా బిజెపి ఆదివారం ప్రకటించిన రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్, కొత్తపల్లి గీతపై వివిధ ఆరోపణలున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో అనకాపల్లి, అరకు ఎంపీ స్థానాలను బిజెపికి కేటాయించారు. ఆ రెండు నియోజకవర్గాల్లో బిజెపికి ఏ మాత్రమూ బలం లేదు. చంద్రబాబుకు సన్నిహితుడైన సిఎం రమేష్‌కు జిల్లాలో టిడిపి నాయకత్వంతో వున్న సంబంధాలు ఎన్నికల్లో దోహదపడతాయని భావిస్తున్నారు. ఆయనకు జిల్లా ప్రజలతో ఏ పరిచయాలూ లేవు. ప్రజలకు చేసిన సేవలూలేవు. టిడిపి బలంతో బిజెపి గెలవాలని చూస్తోంది. సిఎం రమేష్‌కు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ లభించడం వెనుక చంద్రబాబు పాత్ర వుందని ప్రచారం వుంది. టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్‌కు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వకుండా ఈ స్థానం బిజెపికి చంద్రబాబు కేటాయించారు. స్థానికేతరులకు టిక్కెట్ ఇవ్వొద్దని అయ్యన్నపాత్రుడు గతంలో బహిరంగంగానే చెప్పారు. పొత్తులో స్థానికేతరుడైన రమేష్‌కు బిజెపి టిక్కెట్ వచ్చేలా తన శక్తినంతా చంద్రబాబు ఒడ్డారు. అరకు బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతపై ఏజెన్సీలో తీవ్ర వ్యతిరేకత వుంది. గతంలో వైసిపి తరపున ఎంపీగా గెలిచాక గిరిజనులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఆమెపై వున్నాయి.


సిఎం రమేష్ (అనకాపల్లి)


కొత్తపల్లి గీత (అరకు)

జనసేన అభ్యర్థులు ఇలా..

జనసేన అధికారికంగా ప్రకటించిన అభ్యర్థుల్లో విశాఖ దక్షిణం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ పేరు లేదు. ఈ నియోజకవర్గాన్ని పెండింగ్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. అనకాపల్లికి కొణతాల రామకృష్ణ, యలమంచిలికి సుందరపు విజయ్‌కుమార్, పెందుర్తికి పంచకర్ల రమేష్‌బాబు పేర్లను ఆదివారం ప్రకటించారు.

డిఎస్‌సిపై అయోమయం

టెట్ ఫలితాల్లో జాప్యం
పరీక్షా కేంద్రాల ఎంపికకు ఇవ్వని వెబ్ ఆప్షన్
హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ విషయంలోనూ గందరగోళం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

డిఎస్‌సి పరీక్షల నిర్వహణపై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. సోమవారం నుంచి హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకొనే ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు పరీక్షా కేంద్రాల ఎంపిక కోసం అభ్యర్థులకు వెబ్ అప్షన్ ఇవ్వలేదు. దీంతో వారంతా అయోమయ స్థితిలో పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల కాలం నెట్టుకొచ్చి, ఎన్నికల ముందు అతి తక్కువ పోస్టులతో ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్ వివాదాస్పదమైన విషయం తెలిసిందే. బిఇడి అభ్యర్థులకు స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జిటి పోస్టులకు దరఖాస్తు చేసుకొనే అవకాశం నోటిఫికేషన్‌లో ప్రభుత్వం కల్పించింది. దీంతో బిఇడి అభ్యర్థులు కొంతమంది రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకోగా, కొందరు ఒక్క ఎస్‌జిటి పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. బిఇడి అభ్యర్థులకు ఎస్‌జిటి పోస్టులకు అర్హత కల్పించడంపై కొందరు కోర్టును ఆశ్రయించారు. ఎస్‌జిటిలకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఒక్క ఎస్‌జిటి పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేసుకున్న బిఇడి అభ్యర్థులు డిఎస్‌సి పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. ఎస్‌జిటికి అర్హతలేని బిఇడి అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలనుకున్నా అప్పటికి దరఖాస్తు గడువు పూర్తవడంతో డిఎస్‌సికి దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఎస్‌జిటి పోస్టుకు చెల్లించిన దరఖాస్తు ఫీజు రూ.750ను బిఇడి అభ్యర్థులకు ప్రభుత్వం వాపసు ఇవ్వలేదు.

హైకోర్టు ఆదేశాలతో విద్యాశాఖ సవరించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు డిఎస్‌సి పరీక్షలు జరగాల్సివుంది. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలను ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్‌లో ఎంపిక చేసుకొని, 25 (సోమవారం) నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సివుంది. హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకొనే రోజు వచ్చినా, పరీక్ష కేంద్రం వెబ్‌సైట్‌లో ఎంపిక చేసుకొనే ఆప్షన్ విద్యాశాఖ ఇంతవరకు ఇవ్వలేదు. పరీక్షా కేంద్రం నమోదు చేసుకోకుండా హాల్ టిక్కెట్ ఎలా డౌన్‌లోడ్ చేసుకుంటామని అభ్యర్థులు వాపోతున్నారు. మార్చి 14న విడుదల చేస్తామన్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు ఇంకా ఇవ్వలేదు. గడువు ప్రకారం జరగాల్సిన డిఎస్‌సి పరీక్షల ప్రక్రియ ఏదీ సరిగా ప్రభుత్వం నిర్వహించకపోవడంతో పరీక్షలు జరిగే అవకాశంలేదంటూ వస్తున్న వార్తలతో కొందరు అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.



పరీక్షా కేంద్రం వెబ్ ఆప్షన్ పెట్టుకొనేందుకు, పరీక్షల తేదీకి మధ్య వ్యవధి వారం రోజులు కూడా లేదు. ఎన్నికల ముందు నామమాత్రపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం, వాటి భర్తీకి గడువు ప్రకారం పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేకపోవడంతో అనేక సమస్యలు సృష్టించి పరీక్షలు వాయిదా వేయాలని చూస్తోంది. డిఎస్‌సి పరీక్షలపై విద్యాశాఖాధికారులు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు.

రెండు తుపాకులు స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రామా టాకీస్ సమీపంలోనే శ్రీకృష్ణ ట్రావెల్స్ వద్ద లైసెన్స్ లేకుండా ఉన్న రెండు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఆదివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప మీడియాకు వెల్లడించారు. తుపాకులను కలిగి ఉన్న శ్రీకృష్ణ ట్రావెల్స్ మేనేజర్ వేములకొండ శివ నాగరాజును అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ తుపాకులు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కునాల్ శ్రీవాత్సవని పేర్కొన్నారు. అతడు రెడ్ బస్సు సైట్‌లో విశాఖపట్నం నుండి బెంగళూరు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నాడని, బస్సు ఎక్కేందుకు ట్రావెల్స్ కార్యాలయానికి వచ్చాడని, ఆ సమయంలో అతడి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో ట్రావెల్స్ నిర్వాహకులు ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా పారిపోయాడని తెలిపారు. ఈ క్రమంలో అతని బ్యాగ్ నుంచి పడిన ఒక కవర్‌తో ఈ రెండు నాటు తపాకులు ఉన్నాయని తెలిపారు. అయితే వాటిని వేములకొండ శివ నాగరాజు సంవత్సర కాలంగా దాచిపెట్టి ఉంచాడన్నారు. ఎన్నికల సందర్భంగా టాస్క్‌ఫోర్స్ నిర్వహిస్తున్న దాడుల్లో వీటిని గుర్తించామన్నారు. కునాల్ శ్రీవాత్సవను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాన్ని జార్ఖండ్‌కు పంపించామన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరలో 400మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామీ రఘువీరానంద మహరాజ్, ఆఫీస్ ఇన్‌ఛార్జి స్వామి వేదవిద్యానంద మహారాజ్, స్వామి సేవ్యానంద మహారాజ్ పర్యవేక్షణలో నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్ గోలి వెంకట రామారావు, డాక్టర్ కస్తూరి సుబ్రమణ్యం డాక్టర్ శ్రీకృష్ణ పాతూరి, డాక్టర్ టివి.సుబ్బారావు డాక్టర్ దాసరి ఉమా మహేశ్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్, జిఎస్-ఎల్ వైద్యబృందం పాల్గొని రోగులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా 95మందికి రక్తపరీక్షలు, 13.మందికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఇసిజిలు, 15మందికి ఎక్స్‌రే,లు, ఐదుగురికి ఫిజియోథెరపీ చేశారు.

అలాగే వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించి 72మందికి నేత్రపరీక్షలుచేశారు. 24మందికి కంటిఅద్దాలు అందజేయగా, ఆరుగురిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి వేమగిరి ఆసుపత్రికి తరలించారు. ప్రతివారం నిర్వహించే వైద్యశిబిరాలను సద్వినియోం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వైద్యశిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్లుఎల్. జిబి.భగిరథరాజు. ఉదయ్‌కిరణ్. మంగిరెడ్డి, వి.వెంకట సూర్యచంద్రం, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు, రోగులు, సహాయకులకు భోజన సదుపాయం సమకూర్చినట్లు స్వామీజీ తెలిపారు.

సంధ్య ఆక్వా లైసెన్స్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కోట్ల విలువైన డ్రగ్స్‌ను అక్రమంగా విశాఖకు రవాణా చేసిన సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థల లైసెన్సులను తక్షణం రద్దు చేయాలని విశాఖ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఫిషింగ్ హార్బర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ఎఫెక్ట్‌తో మత్స్య ఎగుమతులకు తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపై నిషేధం విధించే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇప్పటికే విదేశాల్లో ఎపి ఎగుమతులను అనుమానిస్తున్నారన్నారు. డ్రగ్ డీల్ తర్వాత ఆక్వా పరిశ్రమకు నష్టం జరిగే అవకాశం ఏర్పడిందని ఆందోళన వ్యక్తపరిచారు. సంధ్య ఆక్వా సహా అనుబంధ కంపెనీల లైసెన్సులు రద్దు చేయాలని ఎంపెడాకు ఫిర్యాదు చేస్తామన్నారు. డ్రగ్స్ దిగుమతి కేసులో విశాఖ కంటైనర్ టెర్మినల్‌ను సిబిఐ తన విచారణ పరిధిలోకి తీసుకుని దర్యాప్తు చేయాలన్నారు. ప్రయివేట్ కంటైనర్ పోర్టు కావడంతో ఇష్టారాజ్యం నడుస్తోందన్నారు.

రైల్వే సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మే 15 వరకూ 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లల కోసం నిర్వహించనున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆదివారం ప్రారంభించారు. రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రారంభ వేడుకలో ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.